03-10-2024 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - రావణుడి నియమము - అసురీ మతము, అసత్యము చెప్పడము, తండ్రి నియమము - శ్రీమతము, సత్యము చెప్పడము"

ప్రశ్న:- ఏ విషయాల గురించి ఆలోచించి పిల్లలు ఆశ్చర్యపోవాలి?

జవాబు:- 1. ఈ అనంతమైన, అద్భుతమైన నాటకము ఎటువంటిది, ఏ ముఖ కవళికలు, ఏ కర్మలు అయితే క్షణక్షణం గడుస్తూ ఉంటాయో, అవి మళ్ళీ అదే విధంగా రిపీట్ అవుతాయి. ఇది ఎంత అద్భుతము, ఒకరి ముఖ కవళికలు మరొకరితో కలవవు. 2. ఏ విధంగా అనంతమైన తండ్రి వచ్చి మొత్తం విశ్వమంతటికీ సద్గతిని ఇస్తారు, చదివిస్తారు, ఇది కూడా అద్భుతమే.

ఓం శాంతి. ఆత్మిక తండ్రి అయిన శివుడు కూర్చుని తమ ఆత్మిక పిల్లలకు, సాలిగ్రామాలకు అర్థం చేయిస్తున్నారు, ఏమి అర్థం చేయిస్తున్నారు? సృష్టి ఆదిమధ్యాంతాల రహస్యాన్ని అర్థం చేయిస్తారు మరియు దీనిని అర్థం చేయించేవారు ఒక్క తండ్రే, మిగిలిన ఆత్మలు అనగా సాలిగ్రామాలెవరైతే ఉన్నారో, వారందరి శరీరాలకు పేర్లు ఉన్నాయి. ఒక్క పరమాత్మునికి మాత్రమే శరీరము లేదు. ఆ పరమాత్ముని పేరు శివ. వారినే పతిత-పావనా, పరమాత్మ అని అంటారు. వారే పిల్లలైన మీకు మొత్తం విశ్వం యొక్క ఆదిమధ్యాంతాల రహస్యాన్ని అర్థం చేయిస్తున్నారు. పాత్రను అభినయించడానికైతే అందరూ ఇక్కడకు వస్తారు. విష్ణువుకు రెండు రూపాలు ఉన్నాయని కూడా అర్థం చేయించారు. శంకరునికైతే ఎటువంటి పాత్ర లేదు. వీటన్నింటినీ తండ్రి కూర్చుని అర్థం చేయిస్తారు. తండ్రి ఎప్పుడు వస్తారు? ఎప్పుడైతే కొత్త సృష్టి యొక్క స్థాపన మరియు పాత సృష్టి యొక్క వినాశనం జరగాల్సి ఉంటుందో అప్పుడు. పిల్లలకు తెలుసు - కొత్త ప్రపంచంలో ఒక్క ఆది సనాతన దేవీ-దేవతా ధర్మం యొక్క స్థాపన జరుగుతుంది. అది పరమపిత పరమాత్మ తప్ప ఇంకెవరూ చేయలేరు. వారొక్కరే పరమ ఆత్మ, వారినే పరమాత్మ అని అంటారు. వారి పేరు 'శివ'. వారికి శారీరిక పేరు ఉండదు. మిగిలినవారు ఎవరైతే ఉంటారో, వారందరికీ శారీరిక పేర్లు ఉంటాయి. ముఖ్య-ముఖ్యమైనవారు ఎవరైతే ఉంటారో, వారందరూ వచ్చేసారు అని కూడా మీరు అర్థం చేసుకుంటారు. డ్రామా చక్రము తిరుగుతూ-తిరుగుతూ ఇప్పుడు అంతిమానికి చేరుకుంది. అంతిమంలో తండ్రే కావాలి. వారి జయంతిని కూడా జరుపుకుంటారు. శివ జయంతిని కూడా ఈ సమయంలోనే జరుపుకుంటారు. ఇప్పుడే ప్రపంచం మారనున్నది, ఘోర అంధకారం నుండి అపారమైన ప్రకాశము అనగా దుఃఖధామం నుండి సుఖధామంగా అవ్వనున్నది. పిల్లలకు తెలుసు - పరమపిత పరమాత్మ శివుడు పురుషోత్తమ సంగమయుగంలో, పాత ప్రపంచం యొక్క వినాశనము, కొత్త ప్రపంచం యొక్క స్థాపనను చేయడానికి ఒక్కసారి మాత్రమే వస్తారు. మొదట కొత్త ప్రపంచం యొక్క స్థాపన, తర్వాత పాత ప్రపంచం యొక్క వినాశనం జరుగుతుంది. మేము చదువుకుని తెలివైనవారిగా అవ్వాలి మరియు దైవీ గుణాలను కూడా ధారణ చేయాలి అని పిల్లలు అర్థం చేసుకుంటారు. అసురీ గుణాలను మార్చుకోవాలి. దైవీ గుణాలు మరియు అసురీ గుణాల వర్ణన చార్ట్ లో చూపించాల్సి ఉంటుంది. స్వయాన్ని చూసుకోవాలి - మేము ఎవరినీ విసిగించడం లేదు కదా? అబద్ధము అయితే చెప్పడం లేదు కదా? శ్రీమతానికి విరుద్ధంగా అయితే నడవడం లేదు కదా? అబద్ధాలు చెప్పడము, ఎవరికైనా దుఃఖాన్ని ఇవ్వడము, విసిగించడము - ఇవి రావణుడి నియమాలు, మరియు అది రాముడి నియమము. శ్రీమతము మరియు అసురీ మతం యొక్క గాయనము కూడా ఉంది. అర్ధకల్పం అసురీ మతము నడుస్తుంది, దీని ద్వారా మనుష్యులు అసురులుగా, దుఃఖితులుగా, రోగగ్రస్థులుగా అయిపోతారు. పంచ వికారాలు ప్రవేశిస్తాయి. తండ్రి వచ్చి శ్రీమతాన్ని ఇస్తారు. శ్రీమతం ద్వారా మనకు దైవీ గుణాలు లభిస్తాయని పిల్లలకు తెలుసు. అసురీ గుణాలను మార్చుకోవాలి. ఒకవేళ అసురీ గుణాలు ఉండిపోతే, పదవి తగ్గిపోతుంది. జన్మజన్మాంతరాల పాపాల భారము ఏదైతే తలపై ఉందో, అది నంబరువారు పురుషార్థం అనుసారంగా తేలిక అయిపోతుంది. ఇప్పుడు ఇది పురుషోత్తమ సంగమయుగము అని కూడా మీరు అర్థం చేసుకున్నారు. తండ్రి ద్వారా ఇప్పుడు దైవీ గుణాలను ధారణ చేసి కొత్త ప్రపంచానికి యజమానులుగా అవుతారు. తద్వారా, పాత ప్రపంచం తప్పకుండా అంతమవ్వాల్సిందేనని నిరూపించబడుతుంది. కొత్త ప్రపంచ స్థాపన బ్రహ్మాకుమారీ-కుమారుల ద్వారా జరుగనున్నది. ఇది కూడా పక్కా నిశ్చయము ఉంది అందుకే సేవలో నిమగ్నమై ఉన్నారు. ఎవరో ఒకరి కళ్యాణం చేసేందుకు కృషి చేస్తూ ఉంటారు.

మీకు తెలుసు - మన సోదరీ-సోదరులు ఎంత సేవ చేస్తారు. అందరికీ తండ్రి పరిచయాన్ని ఇస్తూ ఉంటారు. తండ్రి తప్పకుండా వచ్చారు, మొట్టమొదట కొద్దిమందినే కలుస్తారు, ఆ తర్వాత వృద్ధి చెందుతూ ఉంటారు. ఒక్క బ్రహ్మ ద్వారా

ఎంతమంది బ్రహ్మాకుమారులుగా అవుతారు. బ్రాహ్మణ కులమైతే తప్పకుండా కావాలి కదా. బ్రహ్మాకుమారీ-కుమారులమైన మనమందరమూ శివబాబా పిల్లలమని, అందరమూ సోదరులమని మీకు తెలుసు. వాస్తవానికి సోదరులము, తర్వాత ప్రజాపిత బ్రహ్మాకు చెందినవారిగా అవ్వడంతో సోదరీ-సోదరులుగా అవుతాము. మళ్ళీ దేవతా కులంలోకి వెళ్ళినప్పుడు సంబంధాలు వృద్ధి చెందుతూ ఉంటాయి. ఈ సమయంలో బ్రహ్మా యొక్క కుమారులు, కుమారీలుగా ఉన్నారు కావున ఒకే కులం అయినట్లు, దీనిని వంశము అని అనరు. కౌరవుల రాజ్యమూ లేదు, పాండవుల రాజ్యమూ లేదు. వంశము అనేది ఎప్పుడైతే రాజులు-రాణులు నంబరువారుగా సింహాసనంపై కూర్చుంటారో, అప్పుడు ఉంటుంది. ఇప్పుడు ఉన్నదే ప్రజలపై ప్రజల రాజ్యము. ప్రారంభం నుండి మొదలుకొని పవిత్ర వంశము మరియు అపవిత్ర వంశము నడుస్తూ వచ్చాయి. పవిత్ర వంశము దేవతలదే ఉండేది. పిల్లలకు తెలుసు - 5 వేల సంవత్సరాల ముందు స్వర్గం ఉండేది, అప్పుడు పవిత్ర వంశము ఉండేది. వారి చిత్రాలు కూడా ఉన్నాయి, మందిరాలు ఎంత వైభవోపేతంగా తయారుచేయబడి ఉన్నాయి. ఇంకెవరి మందిరాలు లేవు. ఈ దేవతలవే ఎన్నో మందిరాలు ఉన్నాయి.

పిల్లలకు అర్థం చేయించారు - అందరి శారీరిక పేర్లు మారుతాయి. వీరికి మాత్రమే 'శివ' అన్న పేరు కొనసాగుతూ వచ్చింది. శివ భగవానువాచ, ఏ దేహధారినీ భగవంతుడు అని అనడం జరగదు. తండ్రి తప్ప ఇంకెవరూ తండ్రి పరిచయాన్ని ఇవ్వలేరు ఎందుకంటే వారికి తండ్రి గురించి తెలియనే తెలియదు. ఇక్కడ కూడా ఎంతోమంది ఉన్నారు, వారికి - తండ్రిని ఎలా స్మృతి చేయాలి అనేది బుద్ధిలోకి రాదు. తికమకపడతారు. ఇంత చిన్నని బిందువు, వారిని ఎలా స్మృతి చేయాలి. శరీరము పెద్దది, దానినే స్మృతి చేస్తూ ఉంటారు. భృకుటి మధ్యలో నక్షత్రం మెరుస్తుంది అని అంటూ ఉంటారు అనగా ఆత్మ నక్షత్రం వంటిది. ఆత్మను సాలిగ్రామము అని అంటారు. శివలింగానికి కూడా పెద్ద రూపంలో పూజ జరుగుతుంది. ఏ విధంగా ఆత్మను చూడలేరో, అదే విధంగా శివబాబా కూడా ఎవరికీ కనిపించరు. భక్తి మార్గంలో బిందువు యొక్క పూజను ఎలా చేయాలి, ఎందుకంటే మొట్టమొదట శివబాబా యొక్క అవ్యభిచారి పూజ ప్రారంభమవుతుంది కదా. కావున పూజ కొరకు తప్పకుండా పెద్ద వస్తువు కావాలి. సాలిగ్రామాలను కూడా పెద్దగా, అండాకారంలో తయారుచేస్తారు. ఒకవైపు అంగుష్ఠం వలె ఉంటారని కూడా అంటారు, ఇంకొకవైపు నక్షత్రము అని కూడా అంటారు. ఇప్పుడిక మీరు ఒక్క విషయముపై నిలబడాలి. అర్ధకల్పం పెద్ద రూపాన్ని పూజించారు. ఇప్పుడు మళ్ళీ బిందువుగా భావించడము - ఇందులో శ్రమ కూడా ఉంది. దానిని చూడలేరు కానీ బుద్ధి ద్వారా తెలుసుకోవడం జరుగుతుంది. శరీరంలోకి ఆత్మ ప్రవేశిస్తుంది, అది మళ్ళీ బయటకు వెళ్ళిపోతుంది, దానిని ఎవరూ చూడలేరు. పెద్దగా ఉంటే కనిపిస్తుంది కూడా. అలాగే తండ్రి కూడా బిందువు కానీ వారు జ్ఞానసాగరుడు, ఇంకెవరినీ జ్ఞానసాగరుడు అని అనరు. శాస్త్రాలు భక్తి మార్గానికి చెందినవి. ఇన్ని వేద-శాస్త్రాలు మొదలైనవాటిని ఎవరు తయారుచేసారు? వ్యాసుడు తయారుచేస్తారని అంటారు. క్రైస్టు యొక్క ఆత్మ ఏ శాస్త్రాలనూ తయారుచేయలేదు. వాటిని తర్వాత మనుష్యులు కూర్చుని తయారుచేస్తారు. జ్ఞానమైతే వాటిలో లేదు. జ్ఞానసాగరుడు ఒక్క తండ్రే. శాస్త్రాలలో జ్ఞానము, సద్గతికి సంబంధించిన విషయాలు లేవు. ప్రతి ఒక్క ధర్మం వారు తమ-తమ ధర్మ స్థాపకులను స్మృతి చేస్తారు. వారు దేహధారులను స్మృతి చేస్తారు. క్రైస్టు యొక్క చిత్రము కూడా ఉంది కదా. అందరి చిత్రాలూ ఉన్నాయి. శివబాబా అయితే పరమ ఆత్మ. ఆత్మలందరూ పరస్పరం సోదరులని ఇప్పుడు మీరు అర్థం చేసుకున్నారు. ఎవరికైనా జ్ఞానమిచ్చి సద్గతినివ్వడానికి సోదరులలో జ్ఞానము ఉండదు. సద్గతిని ఇచ్చేవారు ఒక్క తండ్రే. ఈ సమయంలో సోదరులూ ఉన్నారు, అలాగే తండ్రి కూడా ఉన్నారు. తండ్రి వచ్చి మొత్తం విశ్వంలోని ఆత్మలకు సద్గతిని ఇస్తారు. విశ్వానికి సద్గతిదాత ఒక్కరే. శ్రీ శ్రీ 108 జగద్గురువు అని అనండి లేక విశ్వ గురువు అని అనండి, విషయం ఒక్కటే. ఇప్పుడు ఇది అసురీ రాజ్యము. సంగమములోనే తండ్రి వచ్చి ఈ విషయాలన్నింటినీ అర్థం చేయిస్తారు.

తప్పకుండా ఇప్పుడు కొత్త ప్రపంచం యొక్క స్థాపన జరుగుతుందని మరియు పాత ప్రపంచం యొక్క వినాశనం జరగనున్నదని మీకు తెలుసు. పతితపావనుడు ఒక్క నిరాకారుడైన తండ్రేనని కూడా మీకు అర్థం చేయించారు. దేహధారులెవ్వరూ పతిత-పావనులు కాలేరు. పతితపావనుడు పరమాత్మయే. ఒకవేళ పతిత-పావనా అని ఆ సీత యొక్క రాముడిని అన్నా సరే, భక్తి యొక్క ఫలాన్ని ఇవ్వడానికి భగవంతుడే వస్తారని బాబా అర్థం చేయించారు. అనగా సీతలందరూ వధువులు అయినట్లు మరియు వరుడు ఒక్క రాముడు, వారు అందరికీ సద్గతిని ఇస్తారు. ఈ విషయాలన్నింటినీ తండ్రే కూర్చొని అర్థం చేయిస్తారు. డ్రామానుసారంగా మీరే మళ్ళీ 5 వేల సంవత్సరాల తర్వాత ఈ విషయాలను వింటారు. ఇప్పుడు మీరందరూ చదువుకుంటున్నారు. స్కూల్లో ఎంతమంది చదువుకుంటారు. ఇదంతా డ్రామా తయారై ఉంది. ఏ సమయంలో ఏది చదువుతారో, ఏ కర్మలైతే జరుగుతాయో, ఆ కర్మలే మళ్ళీ కల్పం తర్వాత

అదే విధంగా జరుగుతాయి, అదే విధంగా మళ్ళీ 5 వేల సంవత్సరాల తర్వాత చదువుతారు. ఈ అనాది డ్రామా రచించబడి ఉంది. డ్రామాలో మీరు ఏదైతే చూస్తూ ఉంటారో, అది ఒక్కొక్క క్షణం గడిచే కొద్దీ మీకు కొత్త-కొత్తగా కనిపిస్తుంది. చక్రము తిరుగుతూ ఉంటుంది. కొత్త-కొత్త విషయాలను మీరు చూస్తూ ఉంటారు. ఇప్పుడు మీకు తెలుసు - ఇది 5 వేల సంవత్సరాల డ్రామా, ఇది నడుస్తూనే ఉంటుంది. దీని విస్తారమైతే ఎంతో ఉంది. ముఖ్యమైన విషయాలను అర్థం చేయించడం జరుగుతుంది. పరమాత్మ సర్వవ్యాపి అని అంటారు, కానీ తండ్రి అర్థం చేయిస్తారు - నేను సర్వవ్యాపిని కాను. తండ్రి వచ్చి తమ పరిచయాన్ని మరియు రచన యొక్క ఆదిమధ్యాంతాల పరిచయాన్ని ఇస్తారు. తండ్రి కల్ప-కల్పము మనకు వారసత్వాన్ని ఇవ్వడానికి వస్తారని మీకిప్పుడు తెలుసు. బ్రహ్మ ద్వారా స్థాపన అని అంటూ ఉంటారు కూడా. ఇందులో వివరణ చాలా బాగుంటుంది. విరాట రూపానికి కూడా తప్పకుండా ఏదో అర్థము ఉంటుంది కదా. కానీ ఆ అర్థాన్ని తండ్రి తప్ప ఇంకెప్పుడూ ఎవరూ అర్థం చేయించలేరు. చిత్రాలైతే ఎన్నో ఉన్నాయి కానీ ఒక్క దానికి సంబంధించిన వివరణ కూడా ఎవరి వద్దా లేదు. ఉన్నతోన్నతమైనవారు శివబాబా, వారి చిత్రము కూడా ఉంది కానీ వారి గురించి ఎవరికీ తెలియదు. అచ్చా, ఆ తర్వాత సూక్ష్మవతనము ఉంది, దానిని వదిలేయండి, దాని అవసరమే లేదు. ఇక్కడకు సంబంధించిన చరిత్ర-భౌగోళికాల గురించి అర్థం చేసుకోవాల్సి ఉంటుంది, అదేమో సాక్షాత్కారము యొక్క విషయము. ఎలాగైతే ఇక్కడ వీరిలో తండ్రి కూర్చుని అర్థం చేయిస్తారో, అలా సూక్ష్మవతనంలో కర్మాతీత శరీరంలో కూర్చుని వీరిని కలుస్తారు మరియు మాట్లాడుతారు. అంతేకానీ అక్కడేమీ ప్రపంచ చరిత్ర-భౌగోళికాలు ఉండవు. చరిత్ర-భౌగోళికాలు ఇక్కడికి చెందినవి. సత్యయుగములో దేవీ-దేవతలు ఉండేవారని, వారు నేటికి 5 వేల సంవత్సరాల క్రితం ఉండేవారని పిల్లల బుద్ధిలో కూర్చుని ఉంది. ఈ ఆది సనాతన దేవీ-దేవతా ధర్మం యొక్క స్థాపన ఎలా జరిగింది అన్నది కూడా ఎవరికీ తెలియదు. ఇతర ధర్మాల స్థాపన గురించైతే అందరికీ తెలుసు. పుస్తకాలు మొదలైనవి కూడా ఉన్నాయి. ఇది లక్షల సంవత్సరాల విషయమేమీ కాదు. ఇది పూర్తిగా రాంగ్ కానీ మనుష్యుల బుద్ధి ఏ మాత్రమూ పనిచేయదు. ప్రతి విషయాన్నీ తండ్రి అర్థం చేయిస్తారు - మధురాతి-మధురమైన పిల్లలూ, మంచి రీతిలో ధారణ చేయండి. ముఖ్యమైన విషయము తండ్రి యొక్క స్మృతి. ఇది స్మృతికి సంబంధించిన పరుగే. రేస్ జరుగుతుంది కదా. కొంతమంది ఒంటరిగా పరుగెడతారు, కొంతమంది తమ యుగళ్ ను తమతో పాటు జోడిగా చేసుకుని అప్పుడు పరుగెడతారు. ఇక్కడ జోడీలు ఎవరైతే ఉన్నారో, వారు కలిసి పరిగెత్తే అభ్యాసం చేస్తారు. సత్యయుగంలోకి కూడా ఇలా జోడిగా అయి వెళ్ళాలి అని వారు భావిస్తారు. నామరూపాలైతే మారిపోతాయి, అవే శరీరాలు లభించవు కదా. శరీరాలైతే మారుతూ ఉంటాయి. ఆత్మ ఒక శరీరాన్ని వదిలి ఇంకొక శరీరాన్ని తీసుకుంటుందని భావిస్తారు. ముఖ కవళికలైతే వేరుగా ఉంటాయి. ఏ ముఖ కవళికలు, ఏ కర్మలు అయితే క్షణక్షణము గడుస్తూ ఉంటాయో, అవి మళ్ళీ అదే విధంగా 5000 సంవత్సరాల తర్వాత రిపీట్ అవ్వనున్నాయి అని పిల్లలకు ఆశ్చర్యం అనిపించాలి. ఈ నాటకం ఎంత అద్భుతమైనది, దీనిని ఇంకెవరూ అర్థం చేయించలేరు. మనమందరమూ పురుషార్థం చేస్తామని మీకు తెలుసు. నంబరువారుగా అయితే తయారవుతాము. అందరూ అయితే కృష్ణునిగా అవ్వరు. అందరి ముఖ కవళికలు వేర్వేరుగా ఉంటాయి. ఇది ఎంత పెద్ద అద్భుతమైన నాటకము. ఒకరి ముఖ కవళికలు మరొకరితో కలవవు. ఇదే ఆట అచ్చంగా అదే విధంగా రిపీట్ అవుతుంది. ఇవన్నీ ఆలోచించి ఆశ్చర్యపోవాల్సి ఉంటుంది. అనంతమైన తండ్రి వచ్చి ఏ విధంగా చదివిస్తారు. జన్మజన్మలుగా భక్తి మార్గపు శాస్త్రాలు మొదలైనవి చదువుతూ వచ్చారు, సాధువుల కథలు మొదలైనవి కూడా విన్నారు. ఇప్పుడు తండ్రి అంటారు - భక్తి సమయం పూర్తి అయ్యింది. ఇప్పుడు భక్తులకు భగవంతుని ద్వారా ఫలం లభిస్తుంది. భగవంతుడు ఎప్పుడు ఏ రూపంలో వస్తారు అనేది వారికి తెలియదు. ఒకసారి శాస్త్రాలను చదవడం ద్వారా భగవంతుడు లభిస్తారని అంటారు, ఒకసారి వారు ఇక్కడకు వస్తారు అని అంటారు. శాస్త్రాలతోనే పని జరిగిపోతే మరి తండ్రికి ఎందుకు రావాల్సి వస్తుంది? శాస్త్రాలను చదవడం ద్వారానే భగవంతుడు లభించినట్లయితే మరి భగవంతుడు వచ్చి ఏమి చేస్తారు. అర్ధకల్పం మీరు ఈ శాస్త్రాలను చదువుతూ-చదువుతూ తమోప్రధానంగానే అవుతూ వచ్చారు. కావున పిల్లలకు సృష్టి చక్రం గురించి కూడా అర్థం చేయిస్తూ ఉంటారు, అలాగే దైవీ నడవడిక కూడా కావాలి. ఒకటేమో ఎవరికీ దుఃఖాన్ని ఇవ్వకూడదు. అలాగని ఎవరికైనా విషం కావాలి, అది ఇవ్వకపోవడము అనేది దుఃఖమివ్వడము అయితే కాదు. తండ్రి అలా అనరు. కొందరు ఎటువంటి బుద్ధిహీనులుగా ఉంటారంటే, వారంటారు - బాబా అంటారు కదా, ఎవరికీ దుఃఖము ఇవ్వకూడదు అని. ఇప్పుడు వీరు విషాన్ని అడుగుతున్నారు కావున వారికి అది ఇవ్వాలి, లేకపోతే అది కూడా ఎవరికైనా దుఃఖమివ్వడమే అవుతుంది కదా. అలా భావించే మందబుద్ధి కలవారు కూడా ఉన్నారు. ‘‘పవిత్రముగా తప్పకుండా అవ్వాలి’’ అని తండ్రి అంటారు. అసురీ నడవడిక మరియు దైవీ నడవడిక గురించి కూడా తెలియాలి. మనుష్యులు ఇది కూడా అర్థం చేసుకోరు, వారు - ఆత్మ నిర్లేపి, ఏమైనా చేయండి, ఏమైనా తినండి-తాగండి, వికారాలలోకి వెళ్ళండి, ఏమీ ఫర్వాలేదు అని అంటారు. ఇలాంటివి కూడా నేర్పిస్తారు. ఎంతమందిని పట్టుకుని తీసుకొస్తారు. బయట కూడా

శాకాహారులు ఎంతోమంది ఉంటారు. తప్పకుండా అది మంచిది కావున శాకాహారులుగా అవుతారు. అన్ని జాతులలోనూ వైష్ణవులు ఉంటారు. వారు అశుద్ధమైనవి తినరు, వారు మైనారిటీ (తక్కువమంది). మీరు కూడా మైనారిటీయే ఉన్నారు. ఈ సమయంలో మీరు ఎంత తక్కువమంది ఉన్నారు. మెల్లమెల్లగా వృద్ధి చెందుతూ ఉంటారు. పిల్లలకు ఈ శిక్షణ లభిస్తుంది - దైవీ గుణాలను ధారణ చేయండి. అశుద్ధమైన వస్తువులు ఎవరి చేతితో తయారుచేయబడినవి తినకూడదు. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. మీ చార్ట్ లో చూసుకోవాలి - 1. మేము శ్రీమతానికి విరుద్ధముగా అయితే నడవడం లేదు కదా? 2. అబద్ధాలైతే చెప్పడం లేదు కదా? 3. ఎవరినీ విసిగించడం లేదు కదా? దైవీ గుణాలను ధారణ చేసామా?

2. చదువుతో పాటు దైవీ నడవడికను ధారణ చేయాలి. 'పవిత్రంగా తప్పకుండా అవ్వాలి'. ఎటువంటి అశుద్ధమైన వస్తువులనూ తినకూడదు. పూర్తి వైష్ణవులుగా అవ్వాలి. రేస్ చేయాలి.

వరదానము:- బాబా ఆజ్ఞ అనుసారంగా బుద్ధిని ఖాళీగా ఉంచుకునే వ్యర్థము మరియు వికారీ స్వప్నాల నుండి కూడా ముక్త భవ

బాబా ఆజ్ఞ ఏమిటంటే - నిద్రపోయేటప్పుడు సదా తమ బుద్ధిని క్లియర్ చేసుకోండి, మంచి కావచ్చు, చెడు కావచ్చు, అంతా బాబాకు అర్పించి మీ బుద్ధిని ఖాళీ చేసుకోండి. బాబాకు ఇచ్చి బాబాతో పాటు నిద్రపోండి. ఒంటరిగా కాదు. ఒంటరిగా నిద్రించినా లేక వ్యర్థ విషయాలను వర్ణిస్తూ నిద్రించినా, వ్యర్థమైన మరియు వికారీ స్వప్నాలు వస్తాయి. ఇది కూడా నిర్లక్ష్యమే. ఈ నిర్లక్ష్యాన్ని వదిలి ఆజ్ఞానుసారంగా నడుచుకున్నట్లయితే వ్యర్థమైన మరియు వికారీ స్వప్నాల నుండి ముక్తులవుతారు.

స్లోగన్:- భాగ్యశాలీ ఆత్మలే సత్యమైన సేవ ద్వారా సర్వుల ఆశీర్వాదాలను పొందుతారు.